## క్లుప్తంగా

### ఎదుగుదల లేని పిల్లలకు వైద్య పరీక్షలు

**ఉప్పునుంతల:** స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 0–6 నెలల వయసు లోపు ఎత్తుకు తగిన బరువు లేని చిన్న పిల్లలకు వైద్యాధికారి స్వప్న వైద్యపరీక్షలు నిర్వహించారు. పోషక విలువలు కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తల్లులకు సూచించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న బాలమృతం ప్లస్ ఇస్తే సరిపోతుందని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి చెప్పారు. తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తినిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రజని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీపాషా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**కొల్లాపూర్:** పట్టణంలోని స్వామి వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకుడు భీమయ్య తెలిపారు. పదో తరగతి చదివిన విద్యార్థులకు ఎంఎస్ ఆఫీస్, డాటా ఎంట్రీతో పాటు వివిధ రకాల కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9346541195 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

**తాడూరు:** మండలంలోని అల్లాపూర్‌లో మొదటిసారిగా సీతారామ కల్యాణం నిర్వహించిన సందర్భంగా సింగిల్‌విండో మాజీ చైర్మన్ వెంకట్‌రామారెడ్డి గర్భగుడి నిర్మాణానికి రూ.12 లక్షలు, విగ్రహాలకు 50 వేలు బుధవారం అందజేశారు.

### రాష్ట్రంలో జెండా ఎగురవేస్తాం

**తాడూరు:** రాష్ట్రంలో పార్టీ జెండా ఎగురవేస్తామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండనాగేష్ అన్నారు. బూత్ స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఎంగంపల్లి, ఐతోలులో పర్యటించారు. మరో వారం రోజులపాటు మండలంలోని 24 పంచాయతీల్లో మొత్తం 37పోలింగ్ బూత్‌లకు కమిటీలను పూర్తి చేసి నియోజకవర్గంలో పార్టీ తిరుగులేని శక్తిగా ఎదిగేందుకు ఐక్యంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో లోహిత్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్రీశైలం, బాల స్వామి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

**ఉప్పునుంతల:** మండలంలోని జప్తీసదగోడులోని చందుబట్ల నర్సింహ్మారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఉదయం 10 గంటలకు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతోపాటు కాంసానిపల్లి, దేవదారికుంటతండా, మండల కేంద్రానికి పడమట వైపు ఉన్న గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

### క్షమాపణ చెప్పాలి

**కల్వకుర్తిరూరల్:** మండలంలోని ఎల్లికట్టలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్‌ఎస్‌లో ఉంటూ పార్టీపై ఆరోపణలు చేసిన వారు నిరూపించాలని లేకుంటే క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, తలకొండపల్లి, వెల్దండ, మాడ్గుల, ఆమనగల్ పట్టణ అధ్యక్షులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ విషయాలపై పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేశామన్నారు.

### అంబలి, చలివేంద్రం ప్రారంభం



**పెంట్లవెల్లి:** మండలంలోని జటప్రోల్‌లో బుధవారం మాజీ ఎంపీపీ గోవిందుగౌడ్ అంబలి, చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భీంరెడ్డి, నాగిరెడ్డి, గోపాల్, ఫయాజ్, పెద్దగోపాల్, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

**బల్మూర్:** మండలంలోని కొండనాగులలో బస్టాండ్ వద్ద తెలుగు మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఎంపీపీ అరుణ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవతి, ఎంపీటీసీ పద్మావతి, మాజీ విండో చైర్మన్ చంద్రమోహన్, సుదర్శన్‌రావు, శ్రీనివాసులు, బాల్‌రాజు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో చెట్లు దగ్ధం

**పెద్దకొత్తపల్లి:** కొల్లాపూర్ రోడ్డు పక్కన ఉన్న చెన్నపురావుపల్లి స్టేజి వద్ద విద్యుదాఘాతంతో 10 చెట్లు బుధవారం దగ్ధమయ్యాయి. వ్యవసాయ పొలం వద్ద విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి బీటి రోడ్డు పక్కన ఉన్న చెట్లపై పడడంతో తగలబడి పోయినట్లు రైతులు తెలిపారు.

# హక్కులు సాధించే వరకు పోరాడుతాం



కొల్లాపూర్‌లో నిరసన తెలుపుతున్న వీవోఏలు

**కొల్లాపూర్:** వీఓఏలు చేపట్టిన నిరసన దీక్షలు పట్టణంలో మూడో రోజు కొనసాగాయి. ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో వివిధ గ్రామాలకు చెందిన వీఓఏలు కూర్చున్నారు. వారికి మహిళాసంఘాల అధ్యక్షులు, ఐకేపీ సిబ్బంది సంఘీభావం తెలిపారు. వీఓఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ.. పనికి తగ్గ వేతనం చెల్లించాలన్నారు. కనీస వేతనంగా నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో అలివేల, మాధవి, సత్యనారాయణ, అమీన్‌పాష, రాంచంద్రయ్య, చంద్రకళ, సుజాత తదితరులున్నారు.

**వెల్దండ:** మండల కేంద్రంలో వీఏఓల సమ్మె కొనసాగుతోంది. బుధవారం వారు మాట్లాడుతూ వీఓఏల హక్కులను సాధించేవరకు పోరాటం చేస్తామన్నారు. ఏళ్లుగా మహిళ సంఘాల అభ్యున్నతికి పని చేస్తున్న వీఓఏలకు కనీస గౌరవ వేతనం అందించాలన్నారు. సెర్ప్ ఉద్యోగుల్లా తమను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో జంగమ్మ, జాహెద్, మహిపాల్, అల్లాజీ, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.



వెల్దండలో..

**కల్వకుర్తిరూరల్:** ప్రభుత్వం వీఓఏల డిమాండ్‌లను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ గౌడ్ డిమాండ్ చేశారు. మూడో రోజులుగా వీఓఏలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 18వేల మంది క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారని చెప్పారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో 19ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**అంబేద్కర్ విగ్రహానికి వినతి**

**తెలకపల్లి:** మండలంలో వీఓఏల సమస్యలు పరిష్కరించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వీరి సమ్మెకు తెలంగాణ యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు ఫసియోద్దిన్ మద్దతు తెలిపి మాట్లాడారు. మూడు రోజుల నుంచి వీఓఏలు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వీరికి ప్రభుత్వం రూ.3,900 పారితోషకం ఇవ్వడం సిగ్గు చేటన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన వారికి సీసీ ప్రమోషన్ ఇవ్వాలని, గ్రేడింగ్ సంబంధం లేకుండా ప్రతి నెల వ్యక్తిగత ఖాతాల్లో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలని లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి మండల పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోపస్ లక్ష్మణ్, నాగలక్ష్మి, సుధా, మల్లేష్, ఖాజాజీ, నీలమ్మ, గిరిజ, ఫర్హాత్ బేగం తదితరులు పాల్గొన్నారు.



తెలకపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

# మైనార్టీల సంక్షేమానికి కృషి



రంజాన్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వెల్దండ:** మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ముస్లింలకు రంజాన్ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరెడ్డి, జెడ్పీటీసీ విజితారెడ్డి, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, భాస్కర్‌రావు, అలీ, శ్రీకాంత్, కాడురామ్‌నాయక్, యాకుబ్, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న కమిషనర్ అశ్రిత్ కుమార్

**కల్వకుర్తి టౌన్:** పట్టణంలోని వాటర్ ప్లాంట్ యజమానులు విధిగా నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో వాటర్‌ప్లాంట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. వాటర్‌ను ఫిల్టర్ చేసే ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా, ప్లాంట్లను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛతగా ఉన్న డబ్బాలలోనే నీటిని సరఫరా చేయాలని వారికి సూచించారు. నిత్యం తనిఖీలు ఉంటాయని, ఎలాంటి తప్పిదాలు అయినా ఉపేక్షించేది లేదని, యజమానులంతా విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్గో సేవలు విస్తరించాలి

**బిజినేపల్లి:** ప్రయాణ ప్రాంగణాల ద్వారా ఆర్టీసీ కార్గో సేవల్ని విస్తరించాలని మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల రీజియన్ అధికారి ఎన్.దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ కార్గో సేవలు అందిస్తున్న విభాగాన్ని అధికారులు తనిఖీ చేశారు. కార్గో సేవలపై ప్రయాణికులకు అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా ఆర్టీసీకి, ఏజెంట్‌లకు లాభదాయకమని అన్నారు. ఆర్టీసీ ఆర్‌ఎంఈ శివకృష్ణ, డీఎంఈ రాజు, జైపాల్ తదితరులు ఉన్నారు.

**పెంట్లవెల్లి:** మండలంలోని జటప్రోల్‌లో బుధవారం కొల్లాపూర్ ఆర్టీసీ డిపో అధికారులు ఆర్టీసీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సురక్షితంగా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని, ప్రైవేట్ వాహనాలు, ఆటో, జీపులలో వెళ్లకూడదని వివరించారు. కార్యక్రమంలో బాలసరస్వతీ, సర్పంచ్ ఖాజా, సిబ్బంది పాల్గొన్నారు.



బిజినేపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

## ఈద్గా విస్తరణ పనులు ప్రారంభం



**కొల్లాపూర్:** పట్టణంలో ఖాదర్‌బాషా దర్గా వద్ద ఉన్న ఈద్గా విస్తరణ పనులు బుధవారం ప్రారంభించారు. పనులకు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి నిధులు మంజూరు చేయించినట్లు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రుక్మద్దీన్, అమీన్‌పాష వెల్లడించారు. రంజాన్ పర్వదినం వరకు పనులు పూర్తిచేయించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ చంద్రయ్య

**పెంట్లవెల్లి:** సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ చంద్రయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వారితో ఆన్‌లైన్‌లో చాటింగ్ చేయరాదన్నారు. సోషల్‌మీడియాలో ఎవరికీ తెలియకుండా మెసేజ్‌లు పంపొద్దన్నారు. ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు చెప్పకూడదన్నారు. అదేపనిగా ఎవరైనా వివరాలు అడిగితే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంటి పక్కల వారికి, చదువుకోని వారికి అర్థమయ్యేలా చెప్పాలన్నారు.

## చెరువుపై హక్కు కల్పించండి

**అమ్రాబాద్:** మండలంలోని ఒంగురోపల్లి గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఊర చెరువు మాగ్రామ పొలాల్లో ఉన్నప్పటికీ లక్ష్మాపూర్(బీకే) ప్రజలు అన్ని రకాలుగా లబ్ధి పొందుతున్నారని, ఆ చెరువుపై తమకు హక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భీమయ్య, మల్లేష్, నర్సయ్య, బాలకిష్టయ్య తదితరులు ఉన్నారు.

# కూలీల సంఖ్య పెంచాలి

**చారకొండ:** గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య మరింత పెంచాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో కూలీల హాజరు సంఖ్య, ఆధార్ సీడింగ్ నమోదుపై వివరాలను తెలుసుకున్నారు. ఎన్‌ఎంఎంఎస్ ద్వారా కూలీల హాజరు నమోదు చేయాలన్నారు. మండలంలోని ప్రధాన రహదారి వెంట అవసరమైన చోట మొక్కలను నాటాలన్నారు. అనంతరం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లకు కొత్త సిమ్‌కార్డులను అందజేశారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేష్ ఉన్నారు.



చారకొండలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జయసుధ

**పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి**

**వెల్దండ:** గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెద్దాపూర్‌లో మరుగుదొడ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఇంటింటా మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టాలని సూచించారు. మురుగు రోడ్లపై పారకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, ఏపీఎం రాములునాయక్, కార్యదర్శులు ఉన్నారు.

## పిల్లల సంరక్షణపై బాధ్యతగా వ్యవహరించాలి

**అచ్చంపేట రూరల్:** పిల్లలు సంరక్షణపై బాధ్యతగా వ్యవహరించాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సంస్థ వైద్యురాలు జనని సూచించారు. బుధవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో అచ్చంపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యం, ఆహారం, ఆటలు, సంరక్షణ వంటి విషయాలపై వివరించారు. ఏడబ్ల్యూసీ ఎంసీపీ కార్డు ద్వారా తల్లికి కచ్చితమైన సమాచారం ఇవ్వాలన్నారు. పిల్లల సంరక్షణలో కుటుంబ సభ్యులు, తండ్రి ఎక్కువ సమయం గడపాలని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ దమయంతి, సంస్థ సభ్యులు రాజ్‌కుమార్, కిరణ్, సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**పెద్దకొత్తపల్లి:** గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కల్వకోల్‌లో గురువారం సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతులు కలిపించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు కేటాయించారన్నారు. మత్స్యకార్మికులకు కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు చెందిన కులాంతర వివాహం చేసుకున్నవారికి ఒక్కొక్క జంటకు రూ.2.50లక్షల చెక్కులను మూడు జంటలకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉజ్వల, నాగరాజు, వెంకటస్వామి, లక్ష్మీదేవమ్మ, గణేష్‌రావు, వెంకటయ్య, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

**సీసీ కెమెరాలు ప్రారంభం**

**కోడేరు:** మండలంలోని కొండ్రావుపల్లి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామానికి గతంలోనే సీసీరోడ్లు, వీధిలైట్లు ఏర్పాటు చేశామని, ప్రస్తుతం మన ఊరు మన బడిలో పాఠశాల అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. శేరికుంట వాగు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రుక్మారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.



కల్వకోల్ సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి

**కార్యదర్శులను రెగ్యూలర్ చేయండి**

పంచాయతీ కార్యదర్శులను నోటిఫికేషన్ ప్రకారం ఒకేసారి రెగ్యూలర్ చేయాలని ఎమ్మెల్యేకు కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అన్వేష్, వెంకటేష్, ఉదయ్, సాయి, రమేష్, దేవ, భాస్కర్, ప్రదీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

## కంటివెలుగు శిబిరం తనిఖీ

**కోడేరు:** కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ దశరథం సూచించారు. బుధవారం మండలంలోని జనుంపల్లిలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను ఇస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# పట్టణ అభివృద్ధే ప్రధాన ధ్యేయం

**అచ్చంపేట రూరల్:** పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో 'డయల్ యువర్ చైర్మన్' కార్యక్రమం నిర్వహించారు. పలు వార్డులకు సంబంధించిన ప్రజలు వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, కాలనీల్లో పందుల బెడద తీవ్రంగా ఉందని, డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, నీటి కుళాయిల బిగింపు, విద్యుత్ దీపాలు వంటి సమస్యలు తెలిపారు. వారంలోగా అన్ని సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ బలరాంనాయక్, మేనేజర్ అనిత, కౌన్సిలర్లు శ్రీనివాసులు, మనోహర్‌ప్రసాద్, గౌరీశంకర్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

**మినీ ట్యాంకు బండ్ పనుల పరిశీలన**

పట్టణంలోని మల్లంకుంట వద్ద ఉన్న మినీట్యాంకు బండ్ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే అందుబాటులోకి రానుందని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ తెలిపారు. బుధవారం పనులను పరిశీలించారు. పరిసరాల్లో చెత్తాచెదారం, ఖాళీ కొబ్బరిబోండాలు, చేపలు, కోళ్ల వ్యర్థాలు వేయరాదని హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని, పెద్ద మొత్తంలో జరిమానా వేస్తామని హెచ్చరించారు. అంతకుముందు క్వాలిటీ కంట్రోల్ అధికారులు పనుల నాణ్యతను పరిశీలించారు.



ఫోన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్

# కాంగ్రెస్‌ను ఆదరిస్తేనే అభివృద్ధి



పూర్యానాయక్‌తండాలో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ

**ఉప్పునుంతల:** రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే ప్రజలు ఆశిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. బుధవారం ఉదయం మండలంలోని పూర్యానాయక్‌తండాలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా నాయకులతో కలిసి తండాలో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అనంతరెడ్డి, నర్సింహరావు, విజేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

**లింగాల:** అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందిన తగిలి బాలయ్య, నర్సింహ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ పరామర్శించారు.

**డిమాండ్లు పరిష్కరించాలి**

ఐకేపీలో పని చేస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం మూడో రోజు కొనసాగింది. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు.

# అగ్నిప్రమాదాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**నాగర్‌కర్నూల్:** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు దుకాణాల వద్ద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కృష్ణమూర్తి మాల్స్‌లో అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పొగలో చిక్కుకున్నప్పుడు, బిల్డింగ్ కూలినప్పుడు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయినప్పుడు ఏవిధంగా రక్షించాలనే అంశాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది కురుమూర్తి, గోవిందు, రంగస్వామి, చక్రపాణి, శంకర్, మీనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై డీపీఓకు ఫిర్యాదు

**నాగర్‌కర్నూల్‌రూరల్:** మండలంలోని తూడుకుర్తి పంచాయతీ కార్యదర్శి విధుల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని బీఎస్పీ నాయకులు డీపీఓకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పార్టీ అసెంబ్లీ అధ్యక్షుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ విధులు మరిచి ఎంపీపీ కనుసన్నల్లో పనిచేస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వ అధికారిగా కాకుండా, పార్టీ ఎంపీపీ వ్యక్తిగత సహాయకుడిగా ఉంటున్నాడన్నారు. ఎంపీపీ మెప్పు కోసం గ్రామస్తులపై అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. తక్షణమే కార్యదర్శిపై శాఖాపరమైనచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కల్యాణ్, శ్రీకాంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డీపీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## ముగిసిన పీజీ విద్యార్థుల పర్యటన



ఢిల్లీలో పీజీ కళాశాల విద్యార్థులు

**కొల్లాపూర్:** పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల పర్యటన ముగిసింది. బుధవారం వారు ఢిల్లీ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. పీజీ కళాశాలకు చెందిన ఎంఎస్‌డబ్ల్యూ కోర్సు విద్యార్థులు రెండు రాష్ట్రాల్లోని సామాజిక స్థితిగతులు, సంస్కృతి, సంప్రదాయాలు, రాజకీయ, ఆర్థిక అంశాలపై తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో విద్యార్థులు అనేక విషయాలను తెలుసుకున్నారని పర్యవేక్షకుడు దేవరాజ్ వెల్లడించారు.

## 'బీజేపీని గద్దెదించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి'

**తాడూరు:** కేంద్రంలో బీజేపీని గద్దెదించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ అన్నారు. జాతీయ కమిటీ ఇచ్చిన 'బీజేపీ హటావో దేశ్‌కో బచావో' పిలుపులో భాగంగా ఇంటింటా సీపీఐ పాదయాత్ర మూడో రోజు బుధవారం మండలంలోని గుంతకోడూరు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో వివిధ రంగాలలో అన్యాయాలను ప్రజలకు తెలియజేస్తున్నామని అన్నారు. రాజ్యాంగాని విరుద్ధంగా ఆర్థికవ్యవస్థను ప్రైవేట్ వ్యక్తుల చేతులలో పెట్టుకున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర సభ్యుడు వెంకటయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాడు కేవలం ఐదు ప్రభుత్వరంగ సంస్థలు ఉంటే ప్రస్తుతం 2014నాటికి 400 ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పాటయ్యాయన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేట్‌కరణ తలుపులు పూర్తిగా తెరబడ్డాయని అన్నారు. గుంతకోడూరుతోపాటు అల్లాపూర్, మేడిపూరు, ఆకునెల్లికుదురు, నాగదేవపల్లి, అంతారం మీదుగా మండల కేంద్రానికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో శివశంకర్, కుతుబుద్దీన్, మధుగౌడ్, రవీందర్, ఏకాంబరం గౌడ్, నిరంజన్‌గౌడ్, శ్రీనివాసులు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.